

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

# మన సంస్కృతి, సంప్రదాయాలపై విషం గక్కుతున్న కాంగ్రెస్

**బతుకమ్మ పాటలు అంటేనే సీఎం రేవంత్ ఒంట్లో వణుకు పుడుతున్నది**

- **ప్రవర్తన, పరిపాలన విధానం మార్చుకుంటేనే ప్రజల్లో మెప్పు**
- **విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి**

సూర్యాపేట, అక్టోబర్ 11(నమస్తే తెలంగాణ) : తెలంగాణ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటి చెబుతున్న మన సంస్కృతి, సంప్రదాయాలపై కాంగ్రెస్ విషం గక్కుతున్నదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. బతుకమ్మ పండుగ నిర్వహణలో ప్రభు త్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలు ఇష్టపడే బతుకమ్మ పాటలు అంటేనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఒంట్లో వణుకు పుడుతుందన్నారు. అందుకే రాష్ట్రంలో ఏ మారుమూల ప్రాంతాల్లో కూడా సౌండ్ సిస్టమ్ లేకుండా మహిళలు ఉత్సాహంగా పండుగ చేసుకోకుండా చేశాడని విమర్శించారు. బతుకమ్మ పాట అంటే ముఖ్యమంత్రికి ఎందుకు భయమని, రాష్ట్రంలో ఏం జరుగుతున్నదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రావడం లేదు అనడం కాదని, ఎప్పుడు ఎట్లా రావాలో కేసీఆర్‌కు తెలుసని పేర్కొన్నారు. వరద బాధితులను పరామర్శించేందుకు ఒకటే పూట బీఆర్ఎస్ నాయకులు వస్తే రెండో పూటకు రేవంత్‌రెడ్డికి భయం పట్టుకుందని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, యూట్యూబ్, సోషల్‌మీడియాపై దాడులు చేస్తున్నారని, కేసులు నమోదు చేస్తున్నారని అన్నారు. హైడ్రా పేరుతో రూ.లక్షన్నర కోట్లతో మూసీ ఆధునీకరణతో ఇండ్లు కూలగొడుతుంటే దానిపై అనేక పాటలు వచ్చాయని, అవి ఎక్కడ రాష్ట్ర వ్యాప్తంగా వినిపిస్తాయోనని, వాటిని ఆపేందుకు మహిళలను నిరాశపర్చాడని విమర్శించారు. నిజాం రాజులు, నియంతలను ఎదిరించిన పాటలు బతుకమ్మ నుంచే వచ్చాయని, వాటిని ఆపాలనుకోవడం అవివేకమని, పోలీసులతో ప్రజల నోర్లు మూయించాలనుకుంటే పిచ్చితనమే అవుతుందని మండిపడ్డారు. ఒక పాట బయటకు రాకుండా ఉండాలంటే ప్రభుత్వ ప్రవర్తన, పరిపాలన విధానం మార్చుకొని చెంపలు వేసుకుంటే సాధ్యమవుతుంది తప్ప, ఈ రకంగా ప్రజల నోర్లు మూయించలేరన్నారు. పరిపాలన గొప్పతనం పాటల రూపంలో వస్తుంటే భయమెందుకు రేవంత్‌రెడ్డి అని అన్నారు. బతుకమ్మ పండుగ కల తప్పిందని మళ్లీ మన కేసీఆర్ రావాలని మహిళలు అంటున్నారంటే కేసీఆర్ పరిపాలన దక్షతకు ఆ మాట నిదర్శనమని, ఎన్ని పథకాలు పెట్టినా రేవంత్‌రెడ్డి అలాంటి మాట అనిపించుకోలేవని చెప్పారు. దాడులు, కేసులు, నిషేధాలతో ప్రజలను, బతుకమ్మ పాటలను ఆపలేవన్నారు. రేవంత్‌ది అట్ల తద్ది సంస్కృతి అని, బతుకమ్మ బాధ, భావన తెలియదని, ఇప్పటికైనా పద్ధతి మార్చుకొని పెద్దలను చూసి నేర్చుకొని మహిళలకు క్షమాపణ చెప్పాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు సవరాల సత్యనారాయన, మున్సిపల్ కౌన్సిలర్లు ఎస్‌కే తాహేర్‌పాషా, బీఆర్ఎస్ జిల్లా నాయకులు ఉప్పల ఆనంద్, మాజీ జడ్పీటీసీ జీడి భిక్షం, మాజీ ఎంపీపీ నెమ్మాది భిక్షం ఉన్నారు.



చౌటుప్పల్ పట్టణలో బారులుదీరిన వాహనాలు

# నేడు విజయ దశమి

**• జిల్లా వ్యాప్తంగా శమీ పూజకు ఏర్పాట్లు • పల్లెలకు చేరుకున్న పట్నం**



నల్లగొండలోని ప్రకాశం బజార్‌లో పండుగ రద్దీ

రామగిరి, చిట్యాల, అక్టోబర్ 10 : చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా చెప్పుకొనే విజయదశమి వేడుకను శనివారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఘనంగా జరుపుకోనున్నారు. తెలంగాణ అతి పెద్ద పండుగ అయిన దసరాను సంబురంగా చేసుకునేందుకు ఊరూ వాడ సిద్ధమయ్యాయి. ఉపాధి కోసం వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వాళ్లు కూడా సొంతూళ్లకు రావడంతో గ్రామాల్లోనూ సందడి నెలకొంది. మరోవైపు కొత్త దుస్తుల కొనుగోళ్లతో శుక్రవారం మార్కెట్లు కిటకిటలాడాయి. శనివారం సాయంత్రం దసరా సందర్భంగా శమి పూజ నిర్వహించేందుకు అంతటా ఏర్పాట్లు చేసుకున్నారు. విజయదశమి పండుగను శనివారం నిర్వహించుకోవాలని ధూప, దీప, నైవేద్య అర్చక పథకం రాష్ట్ర అధ్యక్షుడు, దౌలతాబాద్ వాసుదేవ శర్మ, వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ విద్వత్సభ జిల్లా కన్వీనర్ పెన్నా మోహనశర్మలు వేర్వేరుగా ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నుంచి ఉమ్మడి నల్లగొండ జిల్లాతోపాటు పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లే వాహనాలతో విజయవాడ-హైదరాబాద్ హైవే కిటకిటలాడుతున్నది. రెండు రోజుల నుంచే రద్దీ విపరీతంగా ఉన్నా శనివారం మరింత కనిపించింది. చౌటుప్పల్, చిట్యాల పట్టణాల్లో ట్రాఫిక్ జామ్ అయ్యింది.

## సంతోషంగా దసరా జరుపుకోవాలి

- ప్రముఖుల శుభాకాంక్షలు

సూర్యాపేట టౌన్, అక్టోబర్ 11 : చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దసరా పండుగను ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆకాంక్షించారు. శమి పూజ చేసి జమ్మి ఆకును బంగారంగా స్వీకరించే గొప్ప సంస్కృతి తెలంగాణదని పేర్కొన్నారు. పాలపిట్ట, జమ్మి చెట్టును రాష్ట్ర చిహ్నాలుగా గుర్తించిన ఘనత కేసీఆర్‌దేనని గుర్తుచేశారు. ఉమ్మడి జిల్లా ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్, మాజీ ఎమ్మెల్యేలు నలమోతు భాస్కర్‌రావు, కంచర్ల భూపాల్‌రెడ్డి, నోముల భగత్‌కుమార్ వేర్వేరు ప్రకటనల్లో శుభాకాంక్షలు తెలిపారు.



సూర్యాపేటలో జమ్మిచెట్టు వద్ద ఏర్పాట్లు



నకిరేకల్ : గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం అందిస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం

## గీత కార్మికులకు రక్షణకు కాటమయ్య రక్షణ కవచం

- శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నకిరేకల్, అక్టోబర్ 11 : కల్లు గీత కార్మికులను ప్రమాదాల బారి నుంచి రక్షించేందుకు ప్రభుత్వం రూ.10 వేలు విలువ చేసే కాటమయ్య రక్ష కవచం అందిస్తున్నట్లు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నకిరేకల్ జడ్పీహెచ్ ఆవరణలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో శిక్షణ పొందిన కల్లుగీత కార్మికులకు మొదటి విడుతగా 208 కాటమయ్య రక్ష కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండలి చైర్మన్ గుత్తా మాట్లాడుతూ గీత కార్మికులకు ప్రమాదం జరిగిన నెల రోజుల్లోపు ఎక్స్‌గ్రేషియా అందించే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గీత కార్మికుడికి కిట్లను పంపిణీ చేస్తామన్నారు. అంతకు ముందు మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీగా జడ్పీహెచ్‌ఎస్‌కు చేరుకున్నారు. కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ మల్లయ్య, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధికారి వి.రమేశ్, బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజర్ల శంభయ్య, కల్లు గీత సొసైటీ అధ్యక్షుడు కొండ జానయ్యగౌడ్ పాల్గొన్నారు.

# పండుగ పూట ప్రయాణికుల పాట్లు

సరిపడా అందుబాటులో లేని ఆర్టీసీ బస్సులు

ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించిన ప్రజలు



నల్లగొండలో ఆటోలో ప్రమాదకరంగా ప్రయాణం



నల్లగొండ బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

నల్లగొండ సిటీ, అక్టోబరు 11 : దసరా పండుగ పూట సొంత గ్రామాలకు వేళ్లే వారు ప్రయాణానికి అవస్థలు పడ్డారు. ఆర్టీసీ అధికారులు అదనపు బస్సులు ఏర్పాటు చేసినా అవి ప్రధాన రహదారులకు తప్ప గ్రామాలకు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చేసేదిలేక ప్రైవేట్ వాహనాలను నమ్ముకున్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్డీనరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు ఉచిత ప్రయాణం ఉండగా, ఆర్టీసీ అధికారులు ఆ బస్సులను తగ్గించి డీలక్స్ బస్సులను ఎక్కువగా నడిపిస్తుండంతో బస్సుల కోసం గంటల తరబడి ఎదురు చూడాల్సి వచ్చింది.

## 535 మంది డీఎస్సీ అభ్యర్థులు రిపోర్టు

- పాఠశాలల కేటాయింపుపై రాని స్పష్టత

రామగిరి, అక్టోబర్ 11 : డీఎస్సీ నియామక ఉత్తుర్వులు అందుకున్న జిల్లాలోని 535 మంది వివిధ కేటగిరీల అభ్యర్థులు గురు,శుక్రవారాల్లో డీఈఓ కార్యాలయంలో రిపోర్ట్ చేశారు. ప్రత్యేక కౌంటర్‌లో ఆర్డర్‌కాపీ జీరాక్స్‌తోపాటు వివిధ పత్రాలను అందజేశారు. ఎంపికైన అభ్యర్థులకు పాఠశాలల కేటాయింపు ఆన్‌లైన్‌లో ఆప్షన్ ప్రాతిపదికన చేయాలో, ఆఫ్ లైన్‌లో చేయాలనేదిచేయాలనేది స్పష్టత రాలేదని జిల్లా విద్యా శాఖ అధికారులు వెల్లడించారు.








గుర్రంపోడ్ : ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న చామలేడు గ్రామస్తులు

## వెలుగని వీధి దీపాలు.. గ్రామస్తుల ధర్నా

గుర్రంపోడ్, సెప్టెంబర్ 11 : పండుగకు వెలగని వీధి దీపాలపై ఆగ్రహంతో మండలంలోని చామలేడు గ్రామస్తులు శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కొత్త వీధి లైట్లు బిగించాలని పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు కోరినా పట్టించుకోలేదని, పండుగ రోజుల్లో వీధుల్లో అంధకారం నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. పంచాయతీ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని, ఓటర్లను ఇష్టం వచ్చినట్లుగా వార్డులకు మార్పిడి చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి భాగ్యను వివరణ కోరగా గ్రామంలో 140 స్తంభాలకు 60 వీధిలైట్లు వెలుగుతున్నాయని, వెలుగని 80 వీధిలైట్లను శుక్రవారం రాత్రి వరకు బిగించే పనిలో ఉన్నామని తెలిపారు. వీధిలైట్లు వేసే మెకానిక్‌ల కొరత కారణంగా జాప్యం జరుగుతుందని, శనివారం నాటికి అన్ని వీధుల్లో లైట్లు వేస్తామని చెప్పారు. గ్రామస్తులు ఎ.శివకుమార్, డి. శంకర్, యాలాద్రి, శ్రీను, శ్రీకాంత్, రాంబాబు, లింగస్వామి. రవి, సాయి, గణేశ్, శివాజి, వేణు పాల్గొన్నారు.

# విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రైతుల ధర్నా



నడిగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు


నడిగూడెం, అక్టోబర్ 11 : ఇష్టానుసారంగా విద్యుత్ కోతలు విధిస్తుండటంతో పంటలకు నీరు అందక ఎండిపోతున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఐదు రోజులుగా విద్యుత్ లేక పంటలకు సాగునీరు అందక ఎండిపోతున్నాయన్నారు. విద్యుత్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. సిరిపురం, నడిగూడెం, గిల్లేరు మీదుగా వెళ్లే లైన్ సరి చేయాలనే సాకుతో అధికారులు విద్యుత్ నిలిపివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే విద్యుత్ లైన్లను సరిచేసి కరెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు గుండు చిన్న లింగయ్య, గునుగుంట్ల ఆంజనేయులు, ఎలక శ్రీనివాస్‌రెడ్డి, గునుగుంట్ల నరేశ్, సోము నరసింహారెడ్డి, నక్క లింగరాజు పాల్గొన్నారు.






# బ్రిడ్జిని ఢీకొట్టిన లారీ.. మంటల్లో దగ్ధం

**65వ జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం**



మంటల్లో దగ్ధమవుతున్న లారీ

చిట్యాల, అక్టోబర్ 11 : సిమెంట్ లారీ బ్రిడ్జిని ఢీకొట్టడంతో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ఈ సంఘటన శుక్రవారం ఉదయం నల్లగొండ జిల్లా చిట్యాలలో 65వ జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ వైపు నుంచి సిమెంటు లోడ్ లారీ హైదరాబాద్ వైపు వెళ్తున్నది. ఆ లారీ చిట్యాలలోని రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిని దాటిన తర్వాత ఉన్న బ్రిడ్జిని ఢీకొట్టింది. ఈ సంఘటనలో లారీ డీజిల్ ట్యాంకు బ్రిడ్జికి తగిలి పేలిపోవటంతో మంటలు చెలరేగి లారీ దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. రోడ్డుపై లారీ దగ్ధం కావడంతో కొంత సేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దాంతో పోలీసులు ట్రాఫిక్‌ను ఒకే వైపుకు మళ్లించి, దగ్ధమైన లారీని అడ్డు తొలగించారు. దీనిపై ఫిర్యాదు రానందున కేసు నమోదు చేయలేదని ఎస్ఐ తెలిపారు.